సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 11 । జూన్ । 2025

పత్రికా స్వేచ్ఛకు విఘాతం



నినాదాలు చేస్తూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

'సాక్షి' సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు కక్ష సాధింపు చర్యే

- ఏపీ ప్రభుత్వ చర్యను ఖండించిన జర్నలిస్టు సంఘాలు
- జిల్లా పరిషత్ వద్ద నిరసన..గాంధీ విగ్రహానికి వినతి
- పట్టణంలో ర్యాలీ.. ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేత

సంగారెడ్డి: 'సాక్షి' సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం పట్ల పాత్రికేయ సంఘాలు భగ్గుమన్నాయి. జిల్లా కేంద్రంలో మంగళవారం వివిధ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అక్కడ ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జర్నలిస్టులు పట్టణంలోని జెడ్పీ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలోనూ వినతి పత్రం అందజేశారు. ఏపీలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తుంగలో తొక్కుతోందని జర్నలిస్టులు మండిపడ్డారు. అక్కడి ప్రభుత్వ తీరు పత్రికా స్వేచ్ఛను కాలరాసేలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ పాలనలో భాగంగా 'సాక్షి'మీడియాపై, 'సాక్షి'జర్నలిస్టులపై అక్కడి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగపల్లి శ్రీధర్, రాష్ట్ర నాయకులు కాకోల్ల నాగరాజు, సీనియర్ జర్నలిస్టు సురకంటి రాజేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు మహమ్మద్ సిద్దిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు యాదగిరి, నాగరాజుగౌడ్, డేవిడ్, షౌకత్‌అలీ, విల్సన్, శరత్‌బాబు, శ్రీకాంత్, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి పాత బాలప్రసాద్, ఫొటోగ్రాఫర్ శివప్రసాద్, విలేకరులు రాజశేఖర్, బాలయ్య, ఆంజనేయులుగౌడ్, నగేశ్, నర్సింహులు, ప్రశాంత్, శ్రీశైలం, సాల్మాన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నారు



ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం దారుణం. చంద్రబాబు సర్కారు ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోంది. పౌరుల ప్రాథమిక హక్కుకు భంగం కలిగించడమే. జర్నలిస్టుల పట్ల ఇలాంటి చర్యలు హేయం. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే.

-బండారు యాదగిరి, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



ప్రజా సమస్యలను వెలికి తీస్తూ నిత్యం ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టులను ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఏపీ పోలీసులు తక్షణమే కొమ్మినేని శ్రీనివాసరావును విడుదల చేయాలి. అక్కడి పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం సరికాదు. పౌరుల ప్రాథమిక హక్కుకు భంగం కలిగించడమే.

-విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ (టెంజు)

జర్నలిస్టులపై ఏపీ సర్కారు వ్యూహాత్మక దాడులు



ఏపీలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల వ్యూహాత్మకంగా దాడులు చేస్తోంది.కొమ్మినేనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, విధులకు ఆటంకం కలిగించడం వంటి నాన్ బెయిలెబుల్ సెక్షన్లు పెట్టి కుట్రపూరితంగా ఆ రాష్ట్ర పోలీసులు వేధిస్తున్నారు. కారణం లేకుండా ఇలాంటి సెక్షన్లు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

- అక్కపల్లి యోగానందరెడ్డి, టెంజు, జిల్లా అధ్యక్షుడు

నిమ్జ్ లబ్ధిదారుల ఎంపిక షురూ

- సీఎం రేవంత్‌రెడ్డి హామీ అమలు దిశగా అధికారుల చర్యలు
- 3,300 మంది జాబితా సిద్ధం.. ఎంపీడీఓలకు అప్పగింత



నిమ్జ్ కోసం సేకరించిన భూములు (ఫైల్ ఫొటో)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి (నిమ్జ్) నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నిమ్జ్‌లో భూములు కోల్పోతున్న నిర్వాసితుల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల జహీరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ నిర్వాసితుల సమస్యలు మంత్రి దామోదర రాజనర్సింహ తన దృష్టికి తెచ్చారని ఈ ఇళ్ల పట్టాలు ఇప్పించే బాధ్యతలను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అప్పగిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం ఇచ్చిన ఈ హామీ అమలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితుల జాబితాలను అధికారులు రూపొందిస్తున్నారు. ఇప్పటికే సుమారు 3,300 మంది నిర్వాసితుల జాబితాలను భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కార్యాలయం అధికారులు ఆయా మండలాల ఎంపీడీఓలకు అప్పగించారు. మిగిలిన నిర్వాసితుల జాబితాలను కూడా త్వరలో అప్పగించనున్నారు.

వారిలో అర్హులెంత మంది?

భూసేకరణ అధికారులు ఇచ్చిన జాబితాలో ఇందిర మ్మ ఇళ్ల పథకానికి అర్హులు ఎంతమంది ఉన్నారో గుర్తించేందుకు ఎంపీడీఓలు కసరత్తు చేస్తున్నారు. ఈ నిర్వాసితుల్లో అనర్హులు ఎవరైనా ఉన్నారా? అనే దానిపై ఆరా తీస్తున్నారు. భూములు కోల్పోయిన వారిలో కొందరు హైదరాబాద్, సంగారెడ్డివంటి చోట్ల నివాసముంటున్నారు. ఇలాంటి వారిని మినహాయించి స్థానికంగా నివాసముంటున్న నిర్వాసితులకే ఈ గృహాలను మంజూరు చేయనున్నారు. వీరిలో ఇంటి స్థలం ఉన్న వారు ఎంత మంది? స్థలం లేని వారు ఎంత మంది తేల్చనున్నారు. స్థలం లేనివారి కోసం అవసరమైన ప్రభుత్వ స్థలాల గుర్తింపు వంటి వాటిపై అధికారులు ఆయా మండలాల రెవెన్యూ, ఎంపీడీఓలు దృష్టి సారించారు.

5,612 మంది నిర్వాసితులు

మూడు లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా రూ.31 వేల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్ కోసం మొత్తం 12,635 ఎకరాల భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. రాష్ట్రంలో భారీ ఎత్తున భుములు సేకరిస్తున్న వాటిలో నిమ్జ్ కూడా ఒకటి. జహీరాబాద్ ప్రాంతంలో న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని 12 గ్రామాల పరిధిలో ఈ భూములను సేకరిస్తున్నారు. 5,612 మంది రైతులు ఈ నిమ్జ్‌లో భూములు కోల్పోతున్నారు. ఇందులో అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నారు.

భూ సేకరణ వేగవంతం

రాష్ట్ర పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్


మాట్లాడుతున్న సంజయ్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న నిమ్జ్ భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం నిమ్జ్ ప్రాజెక్టుపై కలెక్టర్ వల్లూరు క్రాంతితోపాటు అధికారులతో కలిసి సమీక్షించారు ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ...ప్రాజెక్టును సకాలంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణకు అందించే పరిహార పంపిణీ వేగవంతం చేయాలన్నారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని తెలిపారు. మొదటి దశలో సేకరించిన భూములకు సంబంధించి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని సూచించారు. 12,630 ఎకరాల లక్ష్య సేకరణలో ఇప్పటికే 7,300 ఎకరాలు భూసేకరణ పూర్తయినట్లు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తయితే జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. భూ సేకరణపై ప్రతీ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు, జహీరాబాద్ ఆర్డీఓ రాం రెడ్డి, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిమ్జ్ భూములు పరిశీలన

జహీరాబాద్ నియోజకవర్గంలోని నిమ్జ్ భూములను రాష్ట్ర పరిశ్రమల ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్ స్థానిక అధికారులతో పరిశీలించారు. ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్, ఎల్గోయి గ్రామ శివారుల్లోని ప్రాజెక్టు భూములను పరిశీలించారు.

జ్ఞాన ఉద్యమంలో భారత్ ముందంజ

గ్లోబల్ యంగ్ సైంటిస్ట్ సదస్సులో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ధర్మేంద్ర ప్రధాన్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రపంచ జ్ఞాన ఉద్యమంలో భారత్ ముందు వరుసలో ఉందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. నాగరికత సూత్రాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థ దేశంలో ఉందని వివరించారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో జరుగుతున్న గ్లోబల్ యంగ్ సైంటిస్ట్ సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ పాల్గొని మాట్లాడారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్, ఏఎస్ఆర్ఎఫ్ వంటి కార్యక్రమాలు అట్టడుగు వర్గాల ఆవిష్కరణలను పెంపొందించడానికి, పరిశోధనలకు ప్రోత్సాహకాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అధ్యక్షుడు ప్రొఫెసర్ అసుతోశ్ శర్మ, జీవైఏ కో చైర్మన్ ఎన్సీ ఫ్లోరీస్, ఐఐటీహెచ్ గవర్నింగ్ బాడీ చైర్మన్ డాక్టర్ బీవీ మోహన్‌రెడ్డి, ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు సన్మానం


రాంచందర్‌నాయక్‌ను సన్మానిస్తున్న చౌహాన్

నారాయణఖేడ్: డిప్యూటీ స్పీకర్‌గా ఇటీవల నియమితులైన రాంచందర్ నాయక్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాసేవాలాల్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రమేశ్‌చౌహాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాంచందర్ నాయక్‌ను డిప్యూటీ స్పీకర్‌గా నియమించడం పార్టీకి గిరిజనుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన తెలిపారు. రాంచదర్‌నాయక్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు లక్ష్మణ్ చౌహన్, మోహన్ రాథోడ్ ఆయన వెంట ఉన్నారు.

నకిలీ విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): నకిలీ విత్తన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దశరథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొండాపూర్‌లో తహసీల్దార్ అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ...మండలంలోని పల్లెలను, గ్రామాలను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తన వ్యాపారులు చెలరేగిపోతున్నార న్నారు. రైతులను మోసం చేసేందుకు కాలం చెల్లిన మందులను, నకిలీ విత్తనాలను అంటగడుతున్నారని మండిపడ్డారు. సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... కొండాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలు తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలు అందేలా చూడాలని కోరారు.

సబ్‌జైల్‌ను సందర్శించిన అధికారులు



సబ్‌జైల్‌ను పరిశీలిస్తున్న ఐపీఎస్ అధికారులు

జోగిపేట(అందోల్): జోగిపేట సబ్‌జైల్‌ను రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ఎన్ఏబీ) సందీప్ శాండిల్య పలువురు ఐపీఎస్ అధికారులు బృందాలుగా వచ్చి మంగళవారం సందర్శించారు. సబ్‌జైలులోని అన్ని గదులను, ఏరియాను పరిశీలించారు. ఆకస్మికంగా జైలును సందర్శించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. డిటెక్టివ్ విభాగం డీసీపీ శ్వేతారెడ్డి, టీఎస్ఎన్ఏబీ సందీప్ శాండిల్యలు వేర్వేరుగా జైలును సందర్శించి జైలు పరిసర ప్రాంతాలను కలియతిరిగారు. జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్, అదనపు ఎస్పీ సంజీవరావు, ఐపీఎస్ అధికారి రమణ కుమార్, డీఎస్పీ సత్తయ్యగౌడ్‌లతో కలిసి సందర్శించారు. స్థానిక సీఐ,ఎస్ఐలు కూడా వారి వెంట ఉన్నారు.

మోడల్ హౌజ్ నెల్లో పూర్తి చేయాలి

గృహనిర్మాణ పీడీ చలపతిరావు

కంగ్టి(నారాయణఖేడ్): నెల రోజుల్లోగా మోడల్ హౌజ్ నిర్మాణం పూర్తి చేయాలని సంగారెడ్డి జిల్లా గృహనిర్మాణ ప్రాజెక్టు డైరెక్టర్ చలపతిరావు మంగళవారం ఏఈలను ఆదేశించారు. కంగ్టి మండల కేంద్రంలో మోడల్ హౌజ్ నిర్మాణానికి సంబంధించి మార్క్‌అవుట్ చేశారు. మండలంలోని గాంధీనగర్, జీర్గితండా, సుక్కల్‌తీర్థ్‌లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ తివారీ, ఏఈలు సత్యనారాయణ, అంకుశ్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు ఇంటర్ కీలకం

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని సివిల్స్‌కు ఎంపికయ్యా
- 450 మంది విద్యార్థులకు రూ.9 లక్షల నగదు బహుమతి

పటాన్‌చెరు: విద్యార్థి జీవితంలో లక్ష్యం, ఇంటర్మీడియెట్ అత్యంత కీలకమని విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం ఏర్పాటు చేసిన పదో తరగతి వార్షిక ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు మండలంలోని రుద్రారం గ్రామంలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సు కార్యక్రమాన్ని, రేషన్ షాపులను, ఇందిరమ్మ ఇళ్ల పనులను కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...తాను విద్యార్థి దశలోనే ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని కలెక్టర్ కావాలన్న లక్ష్యం ఏర్పరచుకుని అందుకునుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాన్ని సాధించానన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి..విద్యార్థుల సంక్షేమానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చేస్తున్న సేవలను ఆమె ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి ఇటీవల 30 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. భూ భారతి చట్టాన్ని అనుసరించి ప్రజల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అన్ని అంశాలపై అవగాహన ఉండాలి: ఎస్పీ పరితోశ్

విద్యార్థులు చదువుతోపాటు సమాజంలోని అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. బిహార్‌లోని నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తాను ఐపీఎస్ సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థి దశ నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుతూ లక్ష్యాన్ని సాధించానని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న లక్ష్యంతో..దశాబ్ద కాలంగా పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన 450 మంది మొదటి బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.రెండు వేలు, తృతీయ బహుమతి వెయ్యి రూపాయల చొప్పున రూ. తొమ్మిది లక్షల నగదు పురస్కారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి. చిత్రంలో ఎస్పీ పరితోశ్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు

న్యూస్‌రీల్

రైతుల కోసమే రెవెన్యూ సదస్సులు

సీడీసీ చైర్మన్ రాంరెడ్డి


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీడీసీ చైర్మన్ రాంరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సీడీసీ చైర్మన్ రాంరెడ్డి తెలిపారు. మండలంలోని కంభాలపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సరస్వతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం తెచ్చిన భూభారతితో సమస్యలు పరిష్కారం కానున్నాయన్నారు. భూ భారతి చట్టంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు చేసిన వారికీ రశీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్, నాయకులు బాబు, అంజన్న, భీంసేన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఊపందుకున్న ఇందిరమ్మ ఇళ్ల పనులు


మొగుడంపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి పూనాదుల పనులు ఊరూరా ఊపందుకున్నాయి. జహీరాబాద్, మొగుడంపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఇళ్ల నిర్మాణానికి ఖాళీ స్థలం అందుబాటులో ఉన్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. లబ్ధిదారుల స్థలాల వద్ద ముగ్గు వేసి పునాది పనులు ప్రారంభించారు. రెండు మండలాల్లో పదుల సంఖ్యలో నిర్మాణాలు మొదలయ్యాయి. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో లబ్ధిదారులకు ఇళ్ల సర్టిఫికెట్లు అందజేసి, ముగ్గులు వేశారు.

కార్పొరేట్ ప్రయోజనాలకే లేబర్ కోడ్‌లు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు


మాట్లాడుతున్న చుక్కా రాములు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మోదీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలకే లేబర్ కోడ్‌లను తీసుకువస్తుందని వీటి రద్దు కోసం జులై 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక కార్మికుల జీవితాలు దుర్భరం అయ్యాయని వాపోయారు. లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో ఎంతో అభివృద్ధి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్


దౌల్తాబాద్‌లో మొక్కలు నాటుతున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం ఎంతగానో అభివృద్ధి జరిగిందని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు. హత్నూర మండల బీజేపీ మండల అధ్యక్షులు నాగప్రభు ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. మోదీ 11 ఏళ్ల పాలన అమృతకాలమని ఎన్నో అసాధ్యం కాని నిర్ణయాలు తీసుకుని సుసాధ్యం చేసి దేశాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ఘనత మోదీనేన్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం ... సోమవారం నిర్వహించిన వాహన తనిఖీలో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఏడుగురికి రూ. వెయ్యి, ఐదుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

హోటల్‌లో తిష్ట వేసిన కొండెంగ


హోటల్‌లో కూర్చున్న కొండెంగ

నర్సాపూర్: పట్టణంలోని ఓ హోటల్‌కు మంగళవారం కొండెంగ వచ్చి దర్జాగా కూర్చుంది. అడవి నుంచి వచ్చిన కొండెంగ స్థానిక రెడ్ రోస్ హోటల్‌లోకి వచ్చి ఖాళీగా ఉన్న ఓ టేబుల్ పక్కన కుర్చీలో కూర్చుంది. హోటల్ యజమాని అహ్మద్ దానికి బిస్కట్లు ఇవ్వగా తిని అక్కడే కునుకు సైతం తీసింది. కాగా సుమారు రెండు గంటల పాటు ఉండగా అక్కడకు వచ్చిన కస్టమర్లు దాని పక్క నుంచి వెళ్లినా ఏమనకుండా కూర్చోవడంతో పలువురు మొబైల్స్‌తో ఫొటోలు తీసుకున్నారు. కోతులు తమ ఇండ్లలోకి, హోటళ్లలోకి రాగానే వాటిని వెళ్లగొట్టేందుకు పట్టణ ప్రజలు నానా తంటాలు పడుతుంటారు. కాగా హోటల్‌కి వచ్చిన కొండెంగను యజమాని వెళ్లగొట్టక పోవడం గమనార్హం.

తాళి కట్టిన కొన్ని నిమిషాలకే పిట్స్

చికిత్స పొందుతూ వరుడు మృతి


ధనరాజ్(ఫైల్)

జహీరాబాద్ టౌన్: ఎన్నో కలలతో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టిన పెళ్లి కొడుకుని విధి వెంటాడింది. వధువు మెడలో తాళి కట్టిన కొన్ని నిమిషాలకే వరుడికి పిట్స్ వచ్చి మృతి చెందాడు. ఈ ఘటన జహీరాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. ఝరాసంగం మండలం చిలమామిడి గ్రామానికి గొల్ల రాములు పట్టణంలోని శాంతి నగర్‌లో ఉంటున్నాడు. ఆయన చిన్నకుమారుడు ధనరాజ్(25) పట్టణ సమీపంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 8న పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువర్గం సమక్షంలో పెళ్లి చేసుకున్నాడు. తాళి కట్టిన కొన్ని నిమిషాలకు పెళ్లి పీటలపై పిట్స్ వచ్చి కుప్పకూలాడు. వెంటనే ధనరాజ్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీంతో బంధుమిత్రులు దుఃఖంలో మునిగిపోయారు. చిలమామిడిలో అంత్యక్రియలు నిర్వహించారు.

12న అమర్‌నాథ్‌కు సరుకుల లారీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జమ్ము కశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్రలో భాగంగా చేపట్టనున్న అన్నదాన కార్యక్రమానికి అవసరమైన సరుకుల వాహనాలను ఈ నెల 12న ప్రారంభించనున్నట్లు అమర్‌నాథ్ సేవాసమితి అధ్యక్షుడు కాచం కాశీనాథ్, చైర్మన్ చీకోటి మధుసూదన్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు శరబేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం, అన్నదాన కార్యక్రమం నిర్వహించి, అనంతరం సరుకుల లారీకి పూజలు చేసి పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, టీపీసీసీ సెక్రటరీ గంప మహేందర్ హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు భూపతి, లక్ష్మణ్, రాములు, శరభయ్య, నవీన్ కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రౌండ్ ఇట్లా.. ఆటలు ఎట్లా?

అస్తవ్యస్తంగా హుస్నాబాద్ మినీ, ఇండోర్ స్టేడియం

- పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- పగిలిపోయిన కిటికీ అద్దాలు
- క్రీడా సదుపాయాలు కరువు
- సిబ్బంది లేక నిర్వహణ అధ్వానం


పిచ్చి మొక్కలతో నిండిన మినీ స్టేడియం



హుస్నాబాద్ పట్టణంలోని ఇండోర్ స్టేడియం, పగిలి పోయిన కిటికీ అద్దాలు

హుస్నాబాద్: క్రీడాకారులు వివిధ ఆటల్లో తర్ఫీదు, పోటీలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఇండోర్, మినీ క్రీడా మైదానం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. హుస్నాబాద్ పట్టణ క్రీడాకారులకు ఈ మైదానమే దిక్కు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నడవాల్సిన క్రీడా మైదానాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. గత ప్రభుత్వంలో రూ.2 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు వాటి నిర్వహణ బాధ్యతను ఎవరు చూసుకుంటారో తెలియదు. నిర్మాణాన్ని అధికారుల పర్యవేక్షణ లోపంతో నాసిరకంగా నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రక్షణ సైతం కరువైంది. క్రీడాకారులు షటిల్, బ్యాడ్మింటన్ ఆడాలంటే స్టేడియం తాళం ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటుంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఆకతాయిలు స్టేడియం కిటికీ అద్దాలు పూర్తిగా పగులగొట్టారు. స్టేడియం లోపల వుడ్ మ్యాట్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించినా పనికి రాకుండా పోతుందని స్థానిక క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రత కరువై

నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన మినీ క్రీడా మైదానం నిర్మాణం కోసం ప్రభుత్వం 6.50 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులోనే ఇండోర్ స్టేడియం, బాస్కెట్ బాల్, లాంగ్ టెన్నిస్ కోర్టును ఏర్పాటు చేశారు. అలాగే పెవిలియం భవనంతో పాటు క్రీడా సామగ్రిని భద్రపర్చుకునేందుకు గదులు నిర్మించారు. ఈ భవనాలను ప్రస్తుతం ఎంపీఐ కార్యాలయానికి అద్దెకిచ్చారు. నైట్ వాచ్ మెన్, స్వీపర్ లేకపోవడంతో భద్రత కరువై నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రస్తుతం మినీ స్టేడియం అంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఆడటానికి వీలు లేకుండా గడ్డి మొలిచి నిరుపయోగంగా మారింది. స్టేడియం మధ్యలో హెలీప్యాడ్‌ను కూడా నిర్మించారు. కేవలం మంత్రుల పర్యటన సందర్భంగా వచ్చే హెలిక్యాప్టర్లకు మాత్రమే మైదానం పని చేస్తున్నదన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి. క్రీడా మైదానంలో పలు క్రీడల అభివృద్ధి కోసం రూ.10కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులతో క్రీడా మైదానంలో స్విమ్మింగ్ పూల్, ఫుట్‌బాల్ కోర్టు ఇతరత్రా క్రీడా సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయనున్నట్లు క్రీడా అధికారులు తెలిపారు.

అందుబాటులోకి తెస్తాం



మినీ, ఇండోర్ క్రీడా మైదానాలను స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేస్తాం. గతంలో నిధులు సరిగా లేక నిర్వహణ చేయలేక పోయారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మను చౌదరి దృష్టికి తీసుకెళ్లి మెరుగైన క్రీడా మౌలిక వసతులు కల్పిస్తాం. అవసరమైన మరమ్మతులు చేయిస్తా. నిర్వహణ కోసం పే అండ్ ప్లే కింద క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేస్తాం. నైట్ వాచ్‌మెన్, స్వీపర్‌లను నియమిస్తాం. క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–జంగపల్లి వెంకట నర్సయ్య, డీవైఎస్‌ఓ, సిద్దిపేట

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి


శివరాం (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారిపై పోతంశెట్టిపల్లి శివారు ఏడుపాయలకు వెళ్లే టీ జంక్షన్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ వివరాల ప్రకారం... కొడిపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మెగావత్ శివరాం(44) హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల డిప్యుటేషన్‌పై మెదక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. ఎప్పటిలాగే ఉదయం బైక్‌పై శివరాం కొడిపల్లి నుంచి మెదక్ వెళ్తున్నాడు. ఆర్టీసీ బస్సు మెదక్ నుంచి పటాన్‌చెరుకు వెళ్తోంది. ఏడుపాయల టీ జంక్షన్ వద్దకు రాగానే శివరాం బైకును ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


స్వామి(ఫైల్)


భరత్ గౌడ్ మృతదేహం

వెల్దుర్తి(తూప్రాన్) : ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఎల్కపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మంద స్వామి(42) తనకున్న అరెకరంలో వ్యవసాయంతో పాటు తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుమారు రెండేళ్ల క్రితం పెద్ద కూతురు వివాహం చేయడానికి తెచ్చిన అప్పులతో పాటు రేకుల ఇంటి నిర్మాణానికి తెచ్చిన అప్పులు ఎక్కువయ్యాయి. పంట చిట్టీలకు చెల్లించడానికి డబ్బులు సమకూరకపోవడం, మరో ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉండటం భవిష్యత్తులో వారి వివాహాలు ఎలా చేయాలో మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని ఖాన్ చెరువు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ..

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం... రామేశ్వరంబండా గ్రామానికి చెందిన భరత్ గౌడ్ (26) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం మద్యం తాగి వచ్చి తన ఆటోను స్టార్ట్ చేసేందుకు ఉపయోగించే తాడుతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు..


సాయికిరణ్

వర్గల్(గజ్వేల్): కుటుంబ గొడవలతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వర్గల్ మండలం నెంటూరులో జరిగింది. బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగ స్వామి, సంతోష దంపతుల పెద్ద కొడుకు సాయికిరణ్(20) ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. అయితే కుటుంబ గొడవలతో మనస్తాపానికి గురయ్యాడు. సాయికిరణ్ రోజు మాదిరిగా పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సోమవారం సాయంత్రం గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో ఉన్న వేప చెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. మంగళవారం ఉదయం గ్రామస్తులు గమనించి కుటుంబీకులకు తెలియజేశారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టు బట్టారు.. ర్యాంకు సాధించారు


హర్షవర్ధన్ ఉపాధ్యాయుడు


శివప్రసాద్ ఉపాధ్యాయుడు

జగదేవ్‌పూర్(గజ్వేల్) / బెజ్జంకి(సిద్దిపేట): ఇద్దరిది ఒకే ఊరు..మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారే.కలలు కన్నారు.. ర్యాంకు సాధించారు. సోమవారం విడుదల చేసిన ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశపరీక్షల్లో హర్షవర్ధన్ మొదటి ర్యాంకు సాధించగా, శివప్రసాద్ 6వ ర్యాంకు సాధించాడు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామానికి చెందిన కర్రావుల హర్షవర్ధన్ జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. 2022లో కూడా ఓయూ పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలో స్టేట్ మొదటి ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం కెమిస్ట్రీ ప్రవేశపరీక్ష రాసి మళ్లీ స్టేట్ మొదటి ర్యాంకు పొందాడు. ర్యాంకు రావడం పట్ల సంతోషంగా ఉందని, తన కష్టం వెనుక అమ్మనాన్నల ఆశీర్వాదం ఉందని ఆనందం వ్యక్తం చేశాడు.

శివప్రసాద్‌కు 6వ ర్యాంకు..

గుండారం గ్రామానికి చెందిన బొల్లి శివప్రసాద్ జగదేవ్‌పూర్ మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నాడు. ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ఫిలాసఫీలో స్టేట్ 6వ ర్యాంకు సాధించాడు. మొదటి సారి పరీక్ష రాసి ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందని తెలిపాడు.

ఇంట్లో నుంచి వెళ్లి.. ఎర్రకుంటలో శవమై


గొగికర్ రాకేష్

గజ్వేల్‌రూరల్: భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఎర్రకుంటలో శవమై కనిపించాడు. ఈ ఘటన గజ్వేల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన గుంటుకు రాంచందర్(70) తన భార్య సత్తవ్వతో గొడవపడి ఈనెల 6న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పట్టణంలోని ఎర్రకుంటలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు రాంచందర్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

సంగారెడ్డి క్రైమ్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం.. భవానీనగర్‌కు చెందిన గొగికర్ ఈశ్వర్, కళాబాయి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కొడుకు గొగికర్ రాకేష్ (35) వృత్తిరీత్యా చికెన్ షాప్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం శంకర్‌పల్లికి చెందిన రేవతితో వివాహం జరగగా పాప ఉంది. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 20 రోజుల క్రితం రేవతి పాపను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. ఆదివారం చికెన్ షాపునకు వెళ్లిన రాకేష్ రాత్రి 12 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. సోమవారం కుటుంబ సభ్యులు రూమ్ తలుపులు తడితే తీయలేదు. దీంతో తలుపులు పగులగొట్టి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు పలువురి ఎంపిక

సిద్దిపేటజోన్: జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో మంగళవారం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 5 నుంచి 16 ఏండ్ల లోపు ఉన్న బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 130మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై అంశాల్లో పోటీలు జరిగాయి. పోటీలను మాజీ జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్, సిటిజన్ క్లబ్ అధ్యక్షుడు రమేష్ ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతిభ చూపిన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలను ప్రవీణ్ తదితరులు పర్యవేక్షించారు.

బెట్టింగ్‌కు అలవాటుపడి చోరీలు

- వృద్ధురాలి ఆభరణాల చోరీ కేసులో నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరేందర్ గౌడ్



నిందితులు పెంటయ్య, వరలక్ష్మి

మనోహరాబాద్(తూప్రాన్): వృద్ధురాలికి మాయమాటలు చెప్పి బైక్‌పై ఎక్కించుకుని ఆభరణాలతో ఉడాయించిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. తూప్రాన్ మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన బాదనపురం పెంటయ్య(30) మండలంలోని వట్టూర్ గ్రామానికి చెందిన వరలక్ష్మి(30)తో సహజీవనం చేస్తున్నాడు. కాగా నిందితుడికి భార్యాపిల్లలు ఉన్నారు. నిందితుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై ఈ క్రమంలో లోన్లు సైతం తీసుకున్నాడు. అప్పులు ఎక్కువ అవ్వడంతో తీర్చేందుకు చోరీలు చేస్తున్నాడు. గత సంవత్సరం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఓ పల్సర్ బైక్‌ను చోరీ చేసి ఆంధ్రాకు చెందిన నంబర్ ప్లేట్ అమర్చాడు.ఈ నెల 7న సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మన్నె రామవ్వ పాములపర్తికి వెళ్లేందుకు గజ్వేల్ బస్టాండులో ఉంది. నిందితులు వరలక్ష్మి వృద్ధురాలికి మాయమాటలు చెప్పి పెంటయ్యతో కలిసి బైక్‌పై తీసుకొని పర్కిబండ సమీపంలోని ఓ గుడిలోకి వెళ్లి మద్యం తాగారు. కాగా వృద్ధురాలు మత్తులోకి జారుకోగానే ఆమె ఒంటిపై ఉన్న తులం బంగారు నల్లపూసల తాడు, చెవికమ్మలు, 50 తులాల వెండి కడియాలు చోరీ చేశారు. వృద్ధురాలు అరవగా చంపుతామని బెదిరించి పరారయ్యారు. వెంటనే వృద్ధురాలు మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్పీ ఆదేశాల మేరకు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం దండుపల్లి వద్ద వాహనాల తనిఖీలో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బంది గోవర్ధన్ రావు, రాధాకృష్ణ, భిక్షపతిలను ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ పేర్కొన్నారు.

బైక్‌లో ఉంచిన రూ.30వేలు చోరీ

జహీరాబాద్: పట్టణంలోని బ్లాక్ రోడ్డు వద్ద ఉంచిన బైక్‌లో రూ.30 వేలు గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. పోలీసుల కథనం ప్రకారం... మంగళవారం కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామానికి చెందిన రాజేందర్ జహీరాబాద్‌లోని బరోడా బ్యాంకుకు వెళ్లి రూ.40వేలు డ్రా చేసుకున్నాడు. అక్కడి నుంచి బ్లాక్ రోడ్డుకు వెళ్లి రూ.30 వేలు బైక్‌లో ఉంచి, రూ.10వేలు తీసుకుని కపిల్ చిట్‌ఫండ్‌లో కట్టేందుకు వెళ్లాడు. తరువాత వచ్చి చూడగా బైక్‌లో ఉంచిన డబ్బు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెదనాన్నపై తమ్ముడి కొడుకు దాడి..

- ఆపై పెట్రోలు పోసి నిప్పంటించిన వైనం
- చికిత్స పొందుతూ మృతి


రాములు(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: సొంత పెదనాన్నపై తమ్ముడి కొడుకు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఘనపూర్‌కు చెందిన రాములు (60) (రిటైర్డ్ వీఆర్‌ఓ)కు గ్రామంలో మూడు రూమ్‌లు ఉన్నాయి. పక్కనే ఆయన సోదరుడికి కూడా ఉన్నాయి. రాములు రామచంద్రపురం పరిధిలోని అశోక్‌నగర్‌లో ఉంటున్నాడు. ఆయన సోదరుడు కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతడి భార్య, కుమారులు ఘనపూర్‌లో ఉంటున్నారు. ఈనెల 4న రాత్రి ఘనపూర్‌కు వెళ్లాడు. రాములుకు చెందిన ఇంటిలో ఓ మహిళ ఉండటంతో ఇల్లు నీకు ఎవరు అద్దెకిచ్చారని అడిగాడు. పక్కనే ఉన్న ఆయన తమ్ముడి కొడుకు దిలీప్ కుమార్ వచ్చి నీ ఇల్లు ఎక్కడ ఉందని గొడవపడ్డాడు. అనంతరం రాములుపై దాడి చేసి, పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో తీవ్ర గాయాలైన ఆయనను అదేరోజు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి కుమారుడు చైతన్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర పంటలతో ఆదాయం

- పప్పుధాన్యాలు సాగు చేస్తే మేలు
- ప్రధాన పంటకు ఆశించే చీడపీడలను అరికట్టవచ్చు
- సాగుపై సూచనలు చేస్తున్న అధికారులు


పత్తిపంటలో అంతర పంటగా సాగు చేస్తున్న కంది

కొల్చారం(నర్సాపూర్): సాధారణంగా రైతులు ఒక కాలంలో ఒకే పంటను సాగు చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల బెడద వల్ల పంట నష్టపోతే రైతు ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుంది. సరైన ప్రణాళికతో, అవగాహనతో రెండు లేదా మూడు పంటలను ఒకేసారి సాగు చేయవచ్చు. ఒకటి ప్రధానపంట, రెండవదీ అంతర పంట. ప్రధాన పంటతోపాటు అంతర పంటలుగా పప్పు దినుసులను సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనమని కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి పేర్కొన్నారు.

ప్రయోజనాలు

ఒక పంట నష్టపోతే రెండవ పంట నుంచి రాబడి సంపాదించి, నష్టాన్ని భర్తీ చేయవచ్చు. రైతు పొలం నుంచి ఒకేసారి ఎక్కువ దిగుబడిని పొందవచ్చు. పోషక పదార్థాల వినియోగ సామర్థ్యం పెంచవచ్చు. కలుపు మొక్కలు రాకుండా నివారించవచ్చు. సహజ వనరులైన నేల, నీరు, సూర్యరశ్మిని పంటల మధ్యనున్న ప్రదేశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. నేల కోతను అరికట్టవచ్చు. పంటల నాణ్యతను పెంచవచ్చు. పుష్పజాతి మొక్కలు, గడ్డి జాతి ధాన్యపు మొక్కలతో భూ సారాన్ని పెంచవచ్చు. సరైన పద్ధతిలో పంటల్ని ఎంచుకొని అంతర పంటలు పండించడం ద్వారా ప్రధాన పంటపై ఆశించే చీడపీడలను అరికట్టవచ్చు.

భూసారాన్ని పెంచుతాయి

పప్పుధాన్యాల పంటలు రాల్చిన ఆకులు కుళ్లి సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. వాతావరణంలోని నత్రజనిని రైజోబియం వేరుబుడిపెల ద్వారా స్థిరీకరించి భూసారాన్ని పెంచుతాయి. అంతేకాక అన్ని పప్పుధాన్యాల ఉత్పత్తికి దోహదపడి లభ్యత పెరిగి కొరతను తగ్గిస్తాయి. తోడుగా రైతుకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది.

ఒక పంట మరో పంట దిగుబడిని పెంచేలా..

నేల నుంచి పోషక పదార్థాలు, నీరు గ్రహించే లోతులో వ్యత్యాసం ఉండే వేర్ల నిర్మాణం కలిగిన పంటలను ఎన్నుకోవాలి. ఒక పంట మరో పంట దిగుబడిని పెంపొందించే విధంగా ఉండాలి. పోషక పదార్థాలు, నీరు, వెలుతురు విషయంలో పంటల మధ్య పోటీ ఉండకూడదు. వేర్వేరు కాలపరిమితులలో ఉన్న పంటలను, కలపడం వల్ల పోషక పదార్థాల అవశ్యకతలో తేడాలవల్ల, కీలక దశల్లో పోటీ ఉండకుండా ఆరోగ్యంగా పెంచవచ్చు. బహువార్షిక పంటలైన ఉద్యాన పంటలు తొలుత నాలుగైదేళ్ల వరకు చెట్ల మధ్య ఖాళీ ప్రదేశంలో పంటలు పండించవచ్చు. పంటల పెరుగుదలకు సంబంధించి పొడవు, పొట్టి వ్యత్యాసాలను బట్టి రెండు కంటే ఎక్కువ పంటలను వివిధ దశల్లో పండించవచ్చు. ఒక పంటపై పురుగులను తినే సహజ శత్రువులను పెంపొందించడానికి కూడా అంతర పంటలను పెంచవచ్చు. ప్రధాన పంటలను ఆశించే పురుగులను అంతర పంటపై ఆకర్షించి చీడపీడల బారి నుంచి ప్రధాన పంటను రక్షించవచ్చు.